వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు, సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన క్రూరమృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్యారోగ్య సిబ్బంది రక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చి వారిలో ఆత్మస్థైర్యం నింపాలి.

–డాక్టర్ ఆర్ హరీష్, నర్రవాడ పీహెచ్‌సీ

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి. వైద్యారోగ్య సిబ్బంది భద్రతకు ప్రత్యేక చట్టాలు అవసరం. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో రాత్రి వేళల్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా పోలీసు రక్షణ కల్పించాలి.

–పీ ప్రభావతి, సీనియర్ ఫార్మసిస్ట్, చేజర్ల పీహెచ్‌సీ

రక్షణ లేకుంటే ఎలా?



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుంటే ఎలా? విధులకు వెళ్లిన వారు ఎలా ఉన్నారోనని ఇంట్లో తల్లిదండ్రులు టెన్షన్ పడరా? కోల్‌కతా ఘటన వైద్యుల్లో ఒకింత భయాన్ని నెలకొల్పింది. ప్రభుత్వం కచ్చితంగా రక్షణపై ఫోకస్ పెట్టాలి. మేం ప్రశాంతంగా ఉంటేనే కదా రోగులకు సేవలందించేందుకు వీలవుతుంది.

– డాక్టర్ భారతి, మెడికల్ ఆఫీసర్ కోవూరు



పెట్టుబడి సాయం అందేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం హామీపై నోరు మెదపలేదు. కనీసం అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను సైతం ప్రకటించలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జలదంకి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తోంది. అయినా అన్నదాతకు పెట్టుబడి సాయం అందని పరిస్థితి. ఎన్నికలకు ముందు సీజన్‌కు ముందే పెట్టుబడి సాయంగా రూ. 20 వేలు అందిస్తామన్న చంద్రబాబు హామీ నీటి మీద రాతలా మారిపోయింది. ఇష్టానుసారంగా హామీలు గుప్పించి గద్దెనెక్కిన చంద్రబాబు రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినా కూటమి ప్రభుత్వం ఇప్పటికీ అన్నదాత సుఖీభవపై స్పష్టత ఇవ్వలేదు. రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవగా మార్చడం తప్పా చేసిందేమీ లేదని రైతులు నిట్టూరుస్తున్నారు. పథకం అమలుపై కనీసం స్పష్టత కూడా ఇవ్వకుండా అయోమయానికి గురి చేస్తోందని టీడీపీ ప్రభుత్వంపై అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు. జలదంకి మండలంలో సాగు విస్తీర్ణం 42 వేల ఎకరాలు ఉండగా, ఖరీఫ్‌లో దాదాపు ఏడు వేల ఎకరాల్లో వరి, మినుము, పత్తి, మిరప పంటలు సాగు చేశారు.

పెట్టుబడికి తప్పని తిప్పలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని అన్నదాతల ఖాతాల్లో జమచేసేది. ఈ ఏడాది మే నెలలోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు కొంతమేర ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించే ఆలోచనలు కూడా చేయడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెట్టుబడి ఖర్చులకు అన్నదాతలు ఇబ్బంది పడకుండా చిత్తశుద్ధితో సాయం అందించింది. పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7500 కలిపి ఏడాదికి రూ. 13,500 మూడు విడతలుగా సీజన్ ఆరంభంలోనే బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన తీరును రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు రైతులను మభ్యపెట్టి మోసం చేశాడని వారు నిట్టూరుస్తున్నారు.



బోర్ల కింద వరినాట్లు వేసేందుకు సిద్ధం చేసిన నారుమడి



ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంట

పంట రుణాలకు పాట్లు

టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పంట రుణాలను బ్యాంకుల్లో పొందే పరిస్థితి కనిపించడం లేదు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యువల్ చేసుకోవడం మినహా కొత్త రుణాలు పొందే పరిస్థితి లేదు. దీంతో సేద్యం పనుల కోసం అధిక వడ్డీలకు బయట అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు తమ బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులను సాగించాల్సి వస్తోంది.

రైతులను ఆదుకోవాలి



నాకు రెండెకరాల భూమి ఉంది. వరి, పత్తి సాగు చేస్తున్నా. ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించేది. ఉచిత పంటల బీమాను అమలు చేసేది. కొత్త ప్రభుత్వం రైతులు సాగుకు ఇబ్బందులు పడకుండా పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– గణాది మాల్యాద్రి, రైతు జలదంకి

ఎన్నికల హామీని నెరవేర్చాలి



గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా పెట్టుబడి సాయం అందించకపోవడం సమంజసం కాదు. గత ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా నగదు ఖాతాల్లో జమయ్యేది.

– రావి మాల్యాద్రి, రైతు, జలదంకి

అప్పులు చేయాల్సి వస్తోంది



నాకు ఉన్న పొలంతో పాటు కొంత పొలం కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద సాగుకు పెట్టుబడి సాయం అందేది. అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

– జ్యోతి రామచంద్ర, రైతు, కొత్తపాళెం

సిద్దేశ్వరాలయంలో చోరీ

ఉదయగిరి: గండిపాళెం జలాశయం ఆవరణలో ఉన్న సిద్దేశ్వరాలయంలో గురువారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ప్రధాన గేటు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి హుండీని తెరిచి అందులోని నగదును అపహరించారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పామాయిల్ సాగుపై అవగాహన సదస్సు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరులోని రైతుసేవా కేంద్రంలో పామాయిల్ సాగుపై రైతులకు శనివారం అవగహన సదస్సు నిర్వహించనున్నట్లు వింజమూరు ఉద్యానశాఖ అధికారి సాహూల్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో చిన్నారికి తీవ్రగాయాలు

సోమశిల: విద్యుత్ షాక్‌తో చిన్నారి తీవ్రంగా గాయపడిన ఘటన అనంతసాగరం మండలం సంజీవనగరంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..గ్రామానికి చెందిన మను అనే రెండేళ్ల బాలుడు ఆడుకుంటూ ఇంటి బయట ఉన్న డిష్ వైరును పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుడి చేతి రెండు వేళ్లు కాలిపోయి స్పృహ తప్పి పడిపోయాడు. చిన్నారి అమ్మమ్మ గమనించి వెంటనే అనంతసాగరం పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ శ్రీకాంత్ ప్రాథమిక చికిత్స చేసి ఆత్మకూరుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆత్మకూరులో చిన్నారిని పరీక్షించి వైద్యులు ప్రాణాపాయం లేదని, చిటికెన వేలు పూర్తిగా కాలిపోయిందని, దానిని తొలగించాల్సి ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా గంగాప్రసాద్



గంగాప్రసాద్

ఆత్మకూరు: మున్సిపల్ నూతన కమిషనర్‌గా సీ గంగాప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట కమిషనర్‌గా పనిచేస్తున్న గంగాప్రసాద్‌ను ఆత్మకూరుకు బదిలీ చేసింది. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేస్తున్న షేక్ ఫజులుల్లాను ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

శ్రావణ శోభ



ఆత్మకూరు: పట్టణంలోని ఆలయాల్లో శుక్రవారం శ్రావణ శోభ నెలకొంది. శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కన్యకా పరమేశ్వరి, పంటవీధి పార్వతిదేవి, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవార్లు విశేషాలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహికంగా రాహుకాల పూజలు నిర్వహించారు.

సీతారామపురం: శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సిద్దేశ్వరంలోని ఇష్టకామేశ్వరీదేవికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం



దుత్తలూరు: భారత రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని తహసీల్దార్ వై నాగరాజు అన్నారు. మండలంలోని బ్రహ్మేశ్వరంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, వర్క్ఇన్‌స్పెక్టర్ పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు

దుత్తలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో దుత్తలూరు సెంటర్‌లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

734 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 734 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. వేలానికి 848 బేళ్లు రాగా, 734 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.358, కనిష్టంగా రూ.190, సగటున రూ.272.43 ధర పలికిందని వివరించారు.

సన్మానం

ఆత్మకూరు: ఆత్మకూరు నూతన డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐ జీ గంగాధర్, ఎస్సై షేక్ జిలానీను పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారిణులకు అభినందన

మర్రిపాడు: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబర్చిన విద్యార్థినులను ప్రిన్సిపల్ లక్ష్మీదేవి శుక్రవారం అభినందించారు. విద్యార్థినులు సీహెచ్ శ్రావణి, ఎస్ మానస, నిఖితను శాలువాలతో సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

సోమశిల: అనంతసాగరంలోని టీజీఎన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రీడా, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయులు కేతా శ్రీనివాసులరెడ్డి, మహ్మద్, రాపూరు మాలిని బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం బట్టెడ్డి లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుకున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి/ఆత్మకూరురూరల్ : ప్రస్తుతం అమలు చేస్తున్న ఏకీకృత పెన్షన్ స్కీమును రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉదయగిరి, ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం ఉద్యోగుల ఎన్నో పోరాటాల ఫలితంగా వచ్చిందని, దానిని రద్దు చేయడం తగదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సీపీఎస్ కన్నా జీపీఎస్ మెరుగైందని, జీపీఎస్ కన్నా యూపీఎస్ మెరుగైందని ఇలా అనేక రకాల విధానాలను అమల్లోకి తెస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. తమకు లాభం లేని ప్రతిపాదనలను ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాధర్, ఆత్మకూరు, మర్రిపాడు, అనుమసముద్రంపేట, అనంతసాగరం, ఉదయగిరి మండలాల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

ఆత్మకూరురూరల్/సోమశిల: ఆత్మకూరు, అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయాల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు, సచివాలయాల సంక్షేమ సహాయకులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరులో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల నిర్వహణలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, సచివాలయాల సంక్షేమ సహాయకులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వారంలో రెండు రోజులు ఎస్‌ఎంసీ చైర్మన్లు, మరో రెండు రోజులు సచివాలయ సంక్షేమ సహాయకులు పాఠశాలల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, తదితర కార్యక్రమాలు అమలును ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చొరవ చూపాలన్నారు. ఆత్మకూరు, అనంతసాగరం ఎంఈఓలు చలపతి, జానకీరాం, కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సీతారామపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఉదయగిరి: గడ్డంవారిపల్లి పాఠశాలలో..

సీతారామపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డీఆర్వో కేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినులతో మొక్కలు నాటించారు. వస్త్ర సంచులు పంపిణీ చేశారు. సీతారామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించి ప్రతిజ్ఞ చేయించారు. అటవీశాఖ అధికారులు గౌతమ్, ఖాజామహమ్మద్, చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని గడ్డంవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. హెచ్‌ఎం మాల కొండయ్య, సర్పంచ్ వెంకటస్వామి, అటవీ శాఖ అధికారులు ఏ మల్లికార్జున, సౌజన్య, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో శ్రీనివాసులు మాట్లాడారు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడం తమ బాధ్యతగా భావించాలన్నారు. ప్రిన్సిపల్ సైమన్ రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సింగవరపు సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంగం: మండలంలోని గాంధీజనసంఘం,తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వన మహోత్సవాన్ని నిర్వహించారు. గాంధీజనసంఘంలో జరిగిన కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మల్లికార్జున రావు పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వంద మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సంగంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి పోలీస్ సిబ్బంది కలిసి మొక్కలను నాటారు. క్రైడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు వాగాల శ్రీహరి, హెచ్‌ఎంలు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు డీఆర్వో సౌజన్య, బీట్ సిబ్బంది దొరసానమ్మ పాల్గొన్నారు.



దుత్తలూరులోని ఆదర్శ పాఠశాలలో..



సంగం: గాంధీజనసంఘం పాఠశాలలో..

గుంత పూడ్చివేత

ఆత్మకూరు: పట్టణంలోని బృందావనం కాలనీకి వెళ్లే రోడ్డులో మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం మున్సిపల్ సిబ్బంది గుంతను తవ్వి వదిలేయడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో 'గుంతను తవ్వారు..పూడ్చడం మరిచారు' శీర్షికన మూడ్రోజుల క్రితం కథనం రావడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు.మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం గుంతను పూడ్చించారు. దీంతో కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

మర్రిపాడు: దాహార్తిని తీర్చుకునేందుకు అటవీప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని పడమటినాయుడుపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు దుప్పిని స్వాధీనం చేసుకున్నారు.

పవన్ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

కావలి: పట్టణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను శనివారం నుంచి మూడ్రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జనసేన నాయకులు తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. 31న పట్టణంలోని 40 వార్డుల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. 1న ప్రభుత్వాస్పత్రిలోని మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 2న పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జనసేన నాయకులు సమ్మను వెంకట సుబ్బయ్య, పాబ్బా సాయివిఠల్, శ్రీనాథ్, లక్ష్మీకవిత, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు

సంగం: సంగంలో ప్రభుత్వ గృహ నిర్మాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. గృహ నిర్మాణాల నాణ్యతను తనిఖీ చేసి ఏ మేర నిర్మాణాలు చేపట్టారు..ఏ మేరకు బిల్లులు చెల్లింపులు జరిగాయనే విషయాలపై ఆరాతీశారు. రెండ్రోజుల పాటు తనిఖీలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

దుత్తలూరు: కట్టకిందపల్లి ఎస్సీ కాలనీలోని సర్వే నంబర్ 1026–3లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం ప్రభుత్వ స్థలంలో వీఆర్వో శ్రీనివాసులు, వీఆర్‌ఏ మురళితో బోర్డు ఏర్పాటు చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఇకపై భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లీన్ అండ్ గ్రీన్



ఆత్మకూరులో మొక్కలు నాటుతున్న పోలీసులు

ఆత్మకూరు/అనుమసముద్రంపేట: జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీఐ జీ గంగాధర్, ఎస్సై ఎస్‌కే జిలానీ పోలీసు సిబ్బందితో కలిసి చెత్తను తొలగించి మొక్కలు నాటారు. అలాగే ఏఎస్‌పేట స్టేషన్‌లో ఎస్సై సైదులు, పోలీసు సిబ్బంది స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



సంగం: వంగల్లులోని భీమేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేద పండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ పగడాల రఘురామయ్య పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

మర్రిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆత్మకూరు సీఐ గంగాధర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం

సోమశిల: అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సోమశిల గురుకుల పాఠశాల ప్రహరీని కొంతమేర తొలగించారని, ఆ ప్రాంతంలో ప్రహరీ లేదా గేటును ఏర్పాటు చేయాలని ఎస్‌ఎంసీ చైర్మన్ రాధా కోరారు. ఎంపీడీఓ మధుసూదన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

వరికుంటపాడు: మండలంలోని జడదేవి సమీపంలో ఉన్న పిల్లాపేరు నుంచి పామూరుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను ఏఎస్సై శ్రీనాథ్ గురువారం అర్ధరాత్రి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల మేరకు ఎటువంటి కేసులు నమోదు చేయకుండానే శుక్రవారం మధ్యాహ్నం ట్రాక్టర్లను వదిలేశారు. సామాన్యులు తమ గృహ అవసరాల కోసం పిల్లాపేరు నుంచి ఇసుక తోలుకుంటే పట్టుకుని కేసులు నమోదుచేసే పోలీసులు ఇసుక ట్రాక్టర్లను వదిలేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏఎస్సై శ్రీనాథ్‌ను వివరణ కోరగా రోడ్డు పనుల నిమిత్తం ఇసుక తోలుతున్నందున వాహనాలను వదిలేసినట్లు చెప్పడం విశేషం.

లక్ష్యాలను అధిగమించాలి

ఉదయగిరి: ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి ఉపాధి సిబ్బందికి సూచించారు. ఉదయగిరి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన పండ్ల తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో 1,450 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 300 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు.